

**నకిలీ నోట్ల ముఠా ఆటకట్టు**
దువ్వూరు మండలం కానగూడూరు వద్ద నకిలీ కరెన్సీ నోట్లను చలామణీ చేస్తున్న ముఠాను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. -8లో..



**గుప్త నిధుల కోసం తవ్వకాలు**
వేముల మండలంలోని శ్రీనరసింహస్వామి ఆలయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్న ఆరుగురిని అరెస్టు చేశారు. -8లో..

గరిష్ఠం/కనిష్ఠం
31.0/17.6

**వాతావరణం**
జిల్లాలో శుక్రవారం 17.6 – 31.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### 'భట్రాజు పొగడ్తలు' అన్న నానుడి నిషేధం

కడప సిటీ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భట్రాజు పొగడ్తలు అన్న నానుడిని ఎక్కడా ఏ సందర్భంలో కూడా ప్రజలు వాడకూడదని కలెక్టర్ విజయరామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 డిసెంబరు 20వ తేదిన రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ జారీ చేసిన జీఓ ఎంఎస్ నెంబరు 60 ప్రకారం భట్రాజు పొగడ్తలు అనే నానుడి వాడకంపై నిషేధ ఆంక్షలను విధించడం జరిగిందన్నారు. జీఓ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయాన్ని జిల్లా వాసులు గమనించాలని, ప్రభుత్వ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని కలెక్టర్ సూచించారు.

### అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న వివిధ అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిక అధికారి ఎంఎన్ రాణి ఒక ప్రకటనలో తెలిపారు. 37 అంగన్వాడీ కార్యకర్తలు, 108 సహాయకురాళ్లు, 3 మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. 1.7.2023 నాటికి అభ్యర్థుల వయస్సు 21 సంవత్సరాలు దాటి 35 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థి స్థానిక వివాహితురాలు అయి ఉండాలన్నారు. అంగన్వాడీ కార్యకర్త పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణత, సహాయకురాలు, మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టుకు 7వ తరగతి ఖచ్చితంగా ఉత్తీర్ణులై ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేది ఈనెల 11గా గుర్తించాలన్నారు. 12వ తేది ఉదయం 11 గంటలకు ఆయా ఆర్డీఓ కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### 8న జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో ఈనెల 8వ తేదీ ఉదయం జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ సబ్‌జూనియర్, జూనియర్ విభాగం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి వి. లక్ష్మణ్ తెలిపారు. సబ్‌జూనియర్ బాలుర విభాగంలో 15 సంవత్సరాలలోపు వయసు కలిగిన క్రీడాకారులు ఎంపికలకు అర్హులన్నారు. జూనియర్ విభాగంలో 19 సంవత్సరాలలోపు క్రీడాకారులు అర్హులన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు, 10వ తరగతి మార్కులిస్టు, స్టడీసర్టిఫికెట్‌తో హాజరుకావాలని సూచించారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 13, 14 తేదీల్లో కృష్ణా జిల్లా గన్నవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

### 9న మెడికల్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

కడప రూరల్: ఈ నెల 9వ తేదీన కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేయుటకు మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద మెడికల్ ఆఫీసర్ ఉద్యోగ నియామకాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నెలసరి వేతనం తదితర వివరాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కడప.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్ సైట్‌లో పొందుపరిచామన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని సంబంధిత సర్టిఫికెట్స్‌ను జతపరచాలని పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీన కడపలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని తెలిపారు.

### న్యాయ సహాయ సలహా వ్యవస్థ ప్రారంభం

కడప అర్బన్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆధ్వర్యంలో కడప జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నేతృత్వంలో న్యాయ సహాయం రక్షణ సలహా వ్యవస్థ (ఎల్ఏడీసీఎస్)ను ఆన్‌లైన్ పద్ధతిలో శుక్రవారం ప్రారంభించారు. ఈ వ్యవస్థను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సి. ప్రవీణ్‌కుమార్ ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. కడప హెడ్ క్వార్టర్స్‌లో క్రిమినల్ కేసులలో న్యాయవాదులను నియమించుకునే స్తోమత లేని వారు న్యాయ సహాయం రక్షణ సలహా వ్యవస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చు. న్యాయసహాయం రక్షణ సలహా వ్యవస్థలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా ఎన్. హరిబాబును, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా పి. మనోహర్‌ను నియమించారు. ఆన్‌లైన్ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి, పూర్తి అదనపు ఛార్జ్ (ఎఫ్ఏసి) డిఎల్ఎస్ఏ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీ.ఎన్. మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. కవిత పాల్గొన్నారు.

## అటెండెన్స్ ఆన్‌లైన్

- జనవరి 1 నుంచి ఆన్‌లైన్‌లో కూలీల హాజరు నమోదు
- అక్రమాలకు చెక్
- గతంలో సోషల్ ఆడిట్‌లో కూలీల హాజరుపై ఆరోపణలు



కూలీల ఆన్‌లైన్ హాజరును పరిశీలిస్తున్న డ్వామా పీడీ యదుభూషణరెడ్డి



పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)



కడప సిటీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేసే కూలీల హాజరు విషయంపై కేంద్ర ప్రభుత్వం అక్రమాలను అరికట్టేందుకు ఆన్‌లైన్ హాజరును తీసుకొచ్చింది. జనవరి 1వ తేదీ నుంచి ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ప్రతి పనికి ఎంఎంఎస్ ద్వారా వివరాలు పంపాల్సి ఉంటుంది. ప్రస్తుతం నేషనల్ మస్టర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను (ఎంఎంఎస్) ఆన్‌లైన్ విధానాన్ని పొందుపరిచేందుకు నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్ (ఎన్ఐసీ) టెక్నాలజీని రూపొందించింది. 2006లో ఈ పథకం ప్రారంభం కాగా, కూలీల హాజరు విషయంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. ప్రారంభంలో మ్యానువల్ మస్టర్ ద్వారా హాజరు వేసేవారు. ఆ తర్వాత 2021 నుంచి జనవరి 1వ తేది వరకు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మస్టర్ మెజర్‌మెంట్ సిస్టమ్) ద్వారా హాజరు వేసేవారు. ఈ విధానంలో 20 మందికంటే ఎక్కువ మంది కూలీలు ఉంటేనే అమలవుతుంది. తర్వాత ఈ జనవరి 1వ తేదినుంచి ఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లోనే కూలీల హాజరును నమోదు చేయాల్సి ఉంటుంది.

**2006 నుంచి మార్పులు ఇలా...**

ఉపాధి హామీ పథకాన్ని జిల్లాలో 2006లో ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు కూలీల హాజరు విషయంలో పెను మార్పులు చోటుచేసుకున్నాయి. గతంలో సాధారణ మస్టర్లతో హాజరు వేస్తుండగా, ఆ తర్వాత ఎన్ఎంఎంఎస్ ద్వారా హాజరు ఉండేది. ప్రస్తుతం జనవరి 1వ తేదీ నుంచి ఎంఎంఎస్ విధానాన్ని ఉపయోగించి కూలీల హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో నేరుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కూలీల హాజరు విషయం స్పష్టంగా అర్థమవుతోంది.

**ఒక్కరు ఉన్నా ఆన్‌లైన్ హాజరే**

గతంలో ఎన్ఎంఎంఎస్ ద్వారా 20 మంది కంటే ఎక్కువ మంది కూలీలు హాజరైతేనే ఆన్‌లైన్‌లో నమోదు చేసేవారు. అంతకు సంఖ్య తగ్గితే ఈఎంఎంఎస్ ద్వారా హాజరు ఉండేది. ప్రస్తుతం ఎంఎంఎస్ విధానం ద్వారా సంఖ్యతో పని లేకుండా ఒక్క కూలీ ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లోనే నమోదు చేయాలి. ఒకవేళ ఆన్‌లైన్‌లో అటెండెన్స్ అప్‌లోడ్ చేయకపోతే కూలీలకు ఎటువంటి పేమెంట్ జరగదు. రెండుసార్లు పని ప్రదేశంలో ఫోటోలు తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

**అక్రమాలకు అడ్డుకట్ట**

ఉపాధి పథకం ప్రారంభంలో కూలీల మస్టర్ల విషయానికి వస్తే ఎన్నో ఆరోపణలు వచ్చాయి. సోషల్ ఆడిట్ జరిగినపుడు ప్రతిచోటా కూలీల హాజరు విషయంలోనే సమస్య ఎదురయ్యేది. కొన్నిచోట్ల ఘర్షణ వాతావరణం కూడా చోటుచేసుకుంది. అంటే ఫీల్డ్ అసిస్టెంట్లు కొంతమంది తమ కుటుంబ సభ్యులు, వారికి అనుకూలమైన వారు పనులకు రాకపోయినప్పటికీ మస్టర్లను నింపి హాజరైనట్లు చూపించి అక్రమాలకు పాల్పడిన పరిస్థితులు కోకొల్లలు ఉన్నాయి. విషయం బయట పడ్డాక అక్రమాలకు పాల్పడిన సొమ్మును కొంతమంది చెల్లించకుండానే ఇప్పటికీ కాలయాపన చేస్తున్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఎంఎంఎస్ విధానం అమలులోకి రావడంతో ఈ అక్రమాలకు చెక్ పడింది.

**వ్యక్తిగత పనులకు మినహాయింపు**

అయితే ప్రస్తుతమున్న ఆన్‌లైన్ హాజరు విధానం వ్యక్తిగత పనులకు మినహాయింపు ఇచ్చారు. అంటే ప్లాంటేషన్, కందకాలు, రీ ప్లాంటేషన్, హార్టికల్చర్, హౌసింగ్ పనులు తదితర వాటికి ఈ మినహాయింపు ఉంటుంది.

**ఈ ఆన్‌లైన్ హాజరు ఎంతోమేలు**



ఉపాధి పథకంలో ప్రస్తుతం ఉన్న ఆన్‌లైన్ హాజరు విధానం అందరికీ ఉపయోగకరమే. మనం చేస్తున్న పనులు, హాజరవుతున్న కూలీల సంఖ్య నేరుగా ప్రభుత్వాలకు కూడా తెలిసిపోతుంది. అంతేకాకుండా ఎక్కడా అక్రమాలు జరిగే వీలు ఉండదు. పనులకు వచ్చిన వారికి న్యాయం జరుగుతుంది.

– యదుభూషణరెడ్డి, డ్వామా పీడీ, కడప

### కనుల పండువగా సీతారాముల కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ఉదయం 10 గంటలకు సీతాసమేతుడైన శ్రీ కోదండ రాముడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గల కల్యాణ వేదికపై అర్చకులు ఉత్సవ మూర్తులను వేర్వేరుగా ఉంచారు. అనంతరం సీతారాములకు సుగంధద్రవ్యాలతో పాటు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరినీళ్లతో అభిషేకాలు నిర్వహించారు. నూతన పట్టువస్త్రాలు ధరింపజేసి, తులసి గజమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సతీసమేతుడైన శ్రీ కోదండ రామస్వామికి ఆలయ అర్చకులు కనుల పండువగా పౌర్ణమి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వీక్షించి, తన్మయులయ్యారు.

### 8న జిల్లాస్థాయి హాకీ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో ఈనెల 8వ తేదీ ఉదయం జిల్లాస్థాయి హాకీ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు హాకీ సీనియర్ క్రీడాకారుడు ఎం. శేఖర్ తెలిపారు. బాలుర జూనియర్ విభాగం, బాలికలకు సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు డీఎస్ఏ మైదానంలో సీనియర్ హాకీ కోచ్ ఎ. రమేష్‌బాబు వద్ద రిపోర్ట్ చేయాలని సూచించారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు ఏలూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

## షుగర్ ఫ్యాక్టరీ కార్మికులలో ఆనందం



షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు జీతాల అరియర్స్ చెక్కులను అందచేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

- జీతాల అరియర్స్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు: చెన్నూరు మండల పరిధిలోని దౌలతాపురం షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు జీతాల అరియర్స్ చెక్కులను కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి పంపిణీ చేశారు. ఫ్యాక్టరీకి చెందిన 485 మంది కార్మికులకు సంబంధించి 2012 మార్చి నుండి 2022 ఏప్రిల్ మాసం వరకు రావాల్సిన 13. 80 కోట్ల రూపాయల జీతాల అరియర్స్‌ను ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విడుదల చేసిన నేపథ్యంలో కడప నగరంలోని వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్మికుల సమావేశంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా కార్మికులకు చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం నిత్యం కార్మికుల శ్రేయస్సు గురించి ఆలోచిస్తారని పేర్కొన్నారు. కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సీఎం ప్రత్యేక చొరవ చూపి నిధుల విడుదలకు కృషి చేశారని అన్నారు. కార్మిక నేత కృష్ణ మాట్లాడుతూ కార్మికుల కష్టాలను గుర్తించి సీఎం జగన్ మోహన్ రెడ్డి నిధులు విడుదల చేసి ఆదుకున్నారని, ఆయనకు ఎప్పటికీ రుణపడి వుంటామని అన్నారు. ప్రభుత్వం 485 మంది కార్మికులకు 13. 80 కోట్ల రూపాయల అరియర్స్ నిధులు విడుదల చేయగా ఇప్పటి వరకు 50 మంది కార్మికులకు సుమారు 3. 40 కోట్ల రూపాయలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశామని తెలిపారు. త్వరలో పేపర్ వర్క్ పూర్తి చేసి మిగిలిన కార్మికులకు వేతనాలను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్ రెడ్డి, పార్టీ నేత ఆర్‌వీఎస్ఆర్, కార్మిక నాయకుడు కృష్ణ , , కార్మికులు పాల్గొన్నారు.

## ఏపీపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- డీఆర్వో గంగాధర్‌గౌడ్
- 8న గ్రూప్–1 పరీక్షల నిర్వహణ
- కలెక్టరేట్‌లో గ్రూప్–1 కంట్రోల్ రూము నెంబరు 08562–246344 ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సిటీ : ఈనెల 8వ తేదిన జిల్లాలోని 19 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఏపీపీఎస్సీ గ్రూప్–1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్–1 పరీక్షల నిర్వహణపై డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఏపీపీఎస్సీ పరీక్షల జిల్లా ప్రత్యేక అధికారులైన పర్యవేక్షకులు ఎన్.ప్రమీల (అసిస్టెంట్ సెక్రటరీ, మానిటర్), సీహెచ్‌వీ సాయిప్రకాశ్ (సెక్షన్ ఆఫీసర్)లతో కలిసి పరీక్షలకు విధులు కేటాయించిన లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు.

- డీఆర్వో మాట్లాడుతూ ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్–1 పోస్టుల భర్తీ కోసం ఈనెల 8వ తేది రెండు సెషన్లలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు నిర్వహించనున్న పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు అరగంట ముందే చేరుకోవాలన్నారు. కోవిడ్ నిబంధనల మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీసుశాఖ ప్రతి సెంటర్‌లో బందోబస్తు ఏర్పాటు చేస్తుందన్నారు. ఆయా కేంద్రాల యాజమాన్యాలు అభ్యర్థులకు వసతులను ఏర్పాటు చేయాలన్నారు.

**కంట్రోల్ రూము ఏర్పాటు**

పరీక్షా కేంద్రాలకు సంబంధించి అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఏపీపీఎస్సీ గ్రూప్–1 కంట్రోల్ రూము నెంబరు 08562–246344లో సంప్రదించవచ్చని తెలిపారు. ఈనెల 6వ తేది సాయంత్రం నుండి 8వ తేది మధ్యాహ్నం వరకు ఈ కంట్రోల్ రూము నిర్వహణలో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్లు, లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**కడప నగర పరిధిలో 18 కేంద్రాలు.. ప్రొద్దుటూరు పరిధిలో ఒకటి**

కడప నగర పరిధిలో 18 కేంద్రాలు, ప్రొద్దుటూరు పట్టణ పరిధిలో ఒక పరీక్షా కేంద్రంతో కలిపి మొత్తం 19 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కడప నగరం బాలాజీనగర్‌లో ఉన్న ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీ, సీకే దిన్నె తాడిగొట్లలో ఉన్న కేఎస్ఆర్ఎం కళాశాల, కృష్ణాపురం వద్దగల శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల, చెన్నూరు మండలం చిన్నమాచుపల్లె వద్దగల గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల, రామాంజనేయపురంలో ఉన్న జేఎంజే గరల్స్ జూనియర్ కళాశాల, కడప బుడ్డాయపల్లెలో ఉన్న శ్రీ సాయి కాలేజ్ ఆఫ్ ఐటీ అండ్ మేనేజ్‌మెంట్, కడప వై జంక్షన్ వద్దగల గురుకుల్ విద్యాపీఠ్, పక్కీరుపల్లె రోడ్డులో ఉన్న వివేకానంద మహిళా డిగ్రీ కళాశాల, ఆర్టీసీ బస్టాండు సమీపాన ఉన్న నాగార్జున మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల, కొత్త కలెక్టరేట్ వద్దగల ప్రభుత్వ పురుషుల కళాశాల, కోటిరెడ్డి సర్కిల్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల, ఎర్రముక్కపల్లె చౌడేశ్వరీ ఆలయం వద్దగల బాల వికాస్ హైస్కూలు, హరి టవర్స్ వద్దగల నారాయణ జూనియర్ కళాశాల, ప్రధాన పోస్టాఫీసు వద్దగల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, మరియాపురంలో ఉన్న సెయింట్ జోసెఫ్ బాలుర ఉన్నత పాఠశాల, మరియాపురంలో ఏపీజీబీ ఎదురుగా ఉన్న సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల, బాలాజీనగర్‌లో ఉన్న ఎస్వీ డిగ్రీ కళాశాల, శ్రీ హరి డిగ్రీ అండ్ పీజీ కళాశాల (రోడ్డు నెంబరు 6), ప్రొద్దుటూరు సమీపాన గల చాపాడు మండలంలోని సీబీఐటీ కళాశాలలను కేంద్రాలుగా నిర్ణయించారన్నారు.

## కరువు సీమలో.. కళా సౌరభం

ఒకప్పటి కరువు జిల్లా ఇప్పుడు చదువుల ఖిల్లాగా మారింది. అనేక విద్యాసంస్థల ఏర్పాటుతో వేలాదిమంది విద్యార్థులకు కడప.. తొలిగడపగా మారింది. కరువు సీమలో విద్యాసౌరభాలు వెదజల్లాలని.. సీమ విద్యార్థుల ఇంట విద్యావెలుగులు నింపాలన్న లక్ష్యంతో కడప నగరంలో డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. 2020 జనవరి 7న ప్రారంభమైన విశ్వవిద్యాలయం శనివారం 3వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించుకుంటున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం..

- నేడు డా. వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వ్యవస్థాపక దినోత్సవం
- 3వ వసంత వేడుకలు




విశ్వవిద్యాలయంలో వివిధ ప్రాంతాల విద్యార్థులతో అధికారులు, అధ్యాపకులు

ఏఎఫ్‌యూ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చొరవతో కడప నగరంలో 2020 జనవరి 3న విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. జనవరి 7న వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంగా ఏర్పాటైంది. ఏర్పాటైన మూడు సంవత్సరాల వ్యవధిలోనే చక్కటి ప్రగతిని సాధిస్తూ రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించింది. స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ పేరుతో 13 కోర్సులు, ఎం.ప్లాన్ పేరుతో ఒక పీజీ కోర్సుతో మొత్తం 14 స్పెషలైజ్డ్ కోర్సులతో 550 మందికి పైగా విద్యార్థులతో విశ్వవిద్యాలయం కళకళలాడుతోంది. రాష్ట్రంలోని విద్యార్థులే కాకుండా తెలంగాణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు సైతం ప్రతి యేటా ప్రవేశాలు పొందుతూ విద్యనభ్యసిస్తున్నారు. నాటా, ఏపీఈఏపీసెట్ (ఎంసెట్), ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌ల ద్వారా ఇందులో ప్రవేశాలు పొందుతున్నారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు సైతం ప్రతిభను కనబరుస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని ఆర్జిస్తుండటం విశేషం.

**వడివడిగా అడుగులు..**

విశ్వవిద్యాలయం ఏర్పాటైన తర్వాత సౌకర్యాలు సమకూర్చుకుంటూ అభివృద్ధి వైపు అడుగులు పడుతున్నాయి. ప్రస్తుతానికి విశ్వవిద్యాలయం కడప నగరంలోని గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణంలోని తాత్కాలిక భవనాల్లో నిర్వహిస్తున్నారు. విశ్వవిద్యాలయ శాశ్వత భవన నిర్మాణాలకు సంబంధించి దాదాపు 135 ఎకరాలు కేటాయిస్తూ రాష్ట్ర కేబినేట్ ఆమోదముద్ర వేసింది. అయితే స్థలసేకరణ, ఎంపికలో సందిగ్ధత నెలకొనడంతో ప్రక్రియ కాస్త మందగించింది. ఈ ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చిన వెంటనే సొంతభవనాల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. కాగా మరో వైపు కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి కేంద్రప్రభుత్వ నిధుల కోసం ఇప్పటికే కేంద్ర ఆర్థికశాఖమంత్రి నిర్మలా సీతారామన్, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌లను కలిసి విశ్వవిద్యాలయానికి రూ.250 కోట్లు కేటాయించాలని కోరారు. ప్రస్తుత జిల్లా కలెక్టర్ వి. విజయ రామరాజు కృషితో రూ.1.15 కోట్ల నిధులతో త్రీడీ ల్యాబ్ ఏర్పాటు చేశారు.

**నేడు వ్యవస్థాపక వేడుకలు..**




డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం 3వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు శనివారం మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య మునగల సూర్యకళావతి, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి విచ్చేసి వేడుకల్లో పాల్గొననున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నారు.

### ఇంటర్ సర్కిల్ క్రికెట్‌లో కడప జట్టు విజయం



విజయం సాధించిన కడప ఏపీఎస్‌పీడీసీఎల్ ఆపరేషన్ జట్టు

కడప కార్పొరేషన్: కాకినాడలో జరిగిన ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్‌లో కడప ఏపీఎస్‌పీడీసీఎల్ (ఆపరేషన్)జట్టు విజయం సాధించింది. ఈనెల 4వ తేది నుంచి 6వ తేది వరకూ ఈ పోటీలు జరిగాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన కడప ఆపరేషన్ జట్టు ఒక వికెట్ కోల్పోయి 135 పరుగులు సాధించింది. ఇందులో మహమ్మద్ అలీ 35 బంతులకు 65 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచాడు. మరో బ్యాట్స్‌మెన్ నరేంద్ర 30 బంతులకు 47 పరుగులు సాధించాడు. తర్వాత బ్యాటింగ్ చేసిన రాజమండ్రి ట్రాన్స్‌కో జట్టు కేవలం 50 పరుగులకే ఆలౌట్ అయ్యింది. బౌలర్లు భరణి, శ్రీధర్ రెండేసి వికెట్లు, అబూబకర్, సుదర్శన్‌లు ఒక్కో వికెట్ పడగొట్టారు. బౌలర్ గోవర్ధన్ ఒక ఓవర్‌ను మేడిన్ చేశాడు.

## క్లుప్తంగా

### జేఎన్‌టీయూ బీటెక్ ఫలితాలు విడుదల



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జీఎస్ఎస్ రాజు

**పులివెందుల టౌన్ :** పులివెందుల జేఎన్‌టీయూ కళాశాలలో గతేడాది నవంబర్/డిసెంబర్ మాసాలలో నిర్వహించిన బీటెక్ పరీక్షా ఫలితాలు విడుదల చేసినట్లు ప్రిన్సిపల్ జీఎస్ఎస్ రాజు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జేఎన్‌టీయూ కళాశాలలో ఆయన మాట్లాడారు. రెగ్యులర్ పరీక్షలకు 355 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా.. 318 మంది ఉత్తీర్ణులై 89.58 ఉత్తీర్ణత శాతం సాధించారన్నారు. ఈ ఫలితాలను తక్కువ సమయంలో విడుదల చేయడం పట్ల పరీక్షా కేంద్ర విభాగాధిపతులు త్యాగరాజన్, రాధాకృష్ణను అభినందించారు. విద్యార్థులు పరీక్షా ఫలితాలను కళాశాలల వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రమణారెడ్డి, పరీక్షా కేంద్ర విభాగాధిపతులు, వివిధ డిపార్ట్‌మెంట్ల విభాగాధిపతులు పాల్గొన్నారు.

### విద్యార్థి అదృశ్యం కేసు నమోదు

**ఓబులవారిపల్లె :** బాలిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఆల్లం శివధనీష్ గురువారం ఉదయం నుంచి కనిపించడం లేదని తల్లి ఆల్లం లక్ష్మమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిరెడ్డిపల్లె గ్రామంలో జిల్లా పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న శివధనీష్ రోజూ మాదిరిగా గురువారం ఉదయం బయలుదేరి వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో తల్లి లక్ష్మమ్మ పాఠశాల ఉపాధ్యాయులను సంప్రదించగా ఉదయం నుంచి పాఠశాలకు రాలేదని తెలిపారు. దీంతో చుట్టుపక్కల బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

# నకిలీ నోట్ల ముఠా ఆటకట్టు

- ముగ్గురు అరెస్ట్, మరొకరు పరారీ
- నకిలీ కరెన్సీ తయారీ సామగ్రి స్వాధీనం




నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వంశీధర్ గౌడ్, స్వాధీనం చేసుకున్న నకిలీ కరెన్సీ

**మైదుకూరు :** మైదుకూరు పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని దువ్వూరు మండలం కానగూడూరు వద్ద నకిలీ కరెన్సీ నోట్లను చలామణి చేస్తున్న ముఠాను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను తన కార్యాలయంలో డీఎస్పీ వంశీధర్‌గౌడ్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, వెల్లడించారు. కానగూడూరులోని పూలమార్కెట్ వద్ద నకిలీ కరెన్సీని చలామణి చేస్తున్నట్టు డీఎస్పీ వంశీధర్ గౌడ్‌కు సమాచారం రావడంతో దువ్వూరు ఎస్ఐ ఆర్.రాఘవేంద్రరెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేశారు. నకిలీ కరెన్సీని చలామణి చేస్తున్న గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన పేర్ల ఏసు అలియాస్ ఏసయ్య, గంగరపు సాగర్‌రెడ్డి, ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన యంగనంపల్లె కోటేశ్వరరావు అనే వారిని అరెస్టు చేశారు. మరొకరు పరారీ అయ్యారు. అరెస్ట్ అయిన నిందితులను విచారణ చేశారు. మైదుకూరులోని కర్నూలు–చిత్తూరు బైపాస్ రోడ్డులో ఉన్న తిరుమల లాడ్జీలో ఉంటూ నకిలీ నోట్లను చలామణి చేస్తున్నట్లు వారు తెలిపారు. పోలీసులు తిరుమల లాడ్జీలో సోదాలు చేశారు. నకిలీ కరెన్సీ తయారీకి ఉపయోగించిన ల్యాప్‌టాప్, కలర్ ప్రింటర్, ల్యామినేటర్, బాండ్ పేపర్స్, కటింగ్ మిషన్, మూడు సెల్ ఫోన్లతోపాటు 59 నకిలీ రూ.200 నోట్లను, 9 ఒకే వైపు ప్రింట్ చేసిన రూ.500 నోట్లను స్వాధీనం చేసుకున్నారు. వారు ఈ నెల 4వ తేదీన మైదుకూరుకు వచ్చి తిరుమల లాడ్జీలో నకిలీ నోట్లను తయారు చేస్తూ చలామణి చేస్తున్నట్టు డీఎస్పీ వంశీధర్ గౌడ్ తెలిపారు. వారిలో ఏసయ్య అనే వ్యక్తిపై గతంలో నకిలీ నోట్ల తయారీ, చలామణిపై వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్టు వివరించారు. నిందితులను కోర్టుకు హాజరుపరుస్తున్నామని, తర్వాత పోలీసు కస్టడీకి తీసుకుని ఎక్కడెక్కడ నకిలీ నోట్లను చలామణి చేశారు, అందులో ఎవరెవరు భాగస్వాములుగా ఉన్నారనే విషయంపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని డీఎస్పీ తెలిపారు. ఏసయ్యపై పీడీ యాక్టు పెట్టే విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన మైదుకూరు రూరల్ సీఐ ఎన్.నరేంద్రరెడ్డి, దువ్వూరు ఎస్ఐ రాఘవేంద్రరెడ్డి, డీఎస్పీ క్రైం పార్టీ ఏఎస్ఐలు నాగేంద్ర, రామభూపాల్‌రెడ్డి, కానిస్టేబుళ్లు అమరేశ్వరరెడ్డి, శివశంకరరావులను జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించినట్టు తెలిపారు.

# భవిష్యత్తుకు పునాది చరిత్ర

- ప్రముఖ చరిత్రకారుడు వకుళాభరణం రామకృష్ణ
- నేటి నుంచి వైవీయూలో 45వ ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాలు



మాట్లాడుతున్న వకుళాభరణం రామకృష్ణ, చిత్రంలో ప్రసాద్‌రెడ్డి, ఆచార్య కె.గంగయ్య

**వైవీయూ :** చరిత్రనే భవిష్యత్తుకు పునాది అని, చరిత్ర లేకుంటే మానవీయ విలువలు తెలియవని ప్రముఖ చరిత్రకారులు, ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యుడు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 45వ ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాల నిర్వహణపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, వైవీయూ చరిత్రవిభాగాధిపతి కంకణాల గంగయ్యతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగివేమన విశ్వవిద్యాలయం వేదికగా ఈ నెల 7, 8 తేదీల్లో రెండు రోజుల పాటు 45వ ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర చరిత్రను భవిష్యత్ తరాలకు అందించడమే లక్ష్యంగా ఏపీ హిస్టరీ కాంగ్రెస్ పని చేస్తోందన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ చరిత్రపై 9 సంపుటాలను తీసుకువచ్చామని, 9వ సంపుటిలో కడప జిల్లా చరిత్ర గురించి ప్రత్యేక అధ్యయనం ఉందన్నారు. ఇండియన్ హిస్టారికల్ రీసెర్చ్ కౌన్సిల్ స్ఫూర్తితో 1976లో ఏర్పాటైన ఈ స్వతంత్ర సంస్థ చరిత్ర పరిశోధన కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. చరిత్ర రచనలో ఉన్న సమస్యలను చర్చించడం, శాస్త్రీయ చరిత్ర రచనకు పునాదులు వేయడం, లక్ష్యాలను నిర్దేశించుకుని బలమైన అధ్యయన పునాదులపై సంస్థ ఏర్పాటైందన్నారు. ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర – సంస్కృతిని భావితరాలకు అందించుటకు ఆంగ్ల, తెలుగుభాషల్లో 9 సంపుటాలను తీసుకువచ్చామన్నారు. 45వ ఏపీ హిస్టరీ కాంగ్రెస్ నిర్వాహకుడు, వైవీయూ చరిత్ర విభాగాధిపతి ఆచార్య కంకణాల గంగయ్య మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఏపీ హిస్టరీ కాంగ్రెస్ నిర్వహణకు విశ్వవిద్యాలయం అధికారులు ఆర్థిక ప్రోత్సాహం అందించడం సంతోషంగా ఉందన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి చరిత్రకారులు విచ్చేసి పత్రసమర్పణ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం రెండు రోజుల పాటు నిర్వహించే సెషన్‌ల గురించి ఆయన వివరించారు. సమావేశంలో చరిత్రకారులు శ్రీనివాసరెడ్డి, కొప్పర్తి మూర్తి, వెంకట్రామయ్య, మురళీమోహన్, నాగార్జున, బాలగొండ గంగాధర్, సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం డైరెక్టర్ ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, పీఆర్‌సెల్ డైరెక్టర్ డా.ఎస్.వి. సుబ్బారెడ్డి, డా.టి.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## భద్రతా ప్రమాణాలు పాటించి ప్రమాదాలు అరికట్టాలి



మాట్లాడుతున్న చీఫ్ జనరల్ మేనేజర్ వరకుమార్

**కడప కార్పొరేషన్ :** విద్యుత్ ఉద్యోగులు భద్రతా ప్రమాణాలు పాటించి ప్రమాదాలను అరికట్టాలని ఏపీఎస్‌పీడీసీఎల్ తిరుపతి హెచ్‌ఆర్‌డీ చీఫ్ జనరల్ మేనేజర్ డీఎస్ వర కుమార్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక బాలాజీనగర్ విద్యుత్ ఉప కేంద్రంలో జిల్లా పర్యవేక్షక ఇంజినీరు ఎస్.మునిశంకరయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి సేఫ్టీ బెల్టు, విద్యుత్ ప్రవాహం తెలుసుకునేందుకు ఇండక్షన్ టెస్టర్, రబ్బరు తొడుగులు, ఎర్త్ రాడ్ తదితర రక్షణ పరికరాలు ఇవ్వడం జరిగిందన్నారు. సిబ్బంది పని చేసేటప్పుడు వీటిని విధిగా ఉపయోగించాలని ఆదేశించారు. కొందరు ఐదు నిముషాల పనే కదా అని తాత్సారం చేసి సేఫ్టీ పరికరాలు వాడక పోవడం వల్ల విద్యుత్ ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయన్నారు. కార్యక్రమంలో ఈఈ నరసింహ ప్రసాద్, డీఈలు చాంద్‌బాషా, నాగమునిస్వామి, ఏడీఈలు, ఏఈలు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అవగాహన కల్పించాలి



విద్యుత్ ఉద్యోగుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ ఎల్ఎన్ ప్రసాద్

**కడప కార్పొరేషన్ :** విద్యుత్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక కడప డివిజన్ విద్యుత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశాభివృద్ధికి మానవ వనరులు ఎంతో విలువైనవన్నారు. సంపాదించే ఇంటి పెద్దను కోల్పోతే ఆ కుటుంబ సభ్యులు పడే వేదన వర్ణనాతీతమన్నారు. ఇది వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యంగా కింది స్థాయి నుంచి పై స్థాయి వరకూ ఉద్యోగులంతా పనిచేయాలన్నారు. విద్యుత్ మోటార్ల స్విచ్‌లు ఆన్, ఆఫ్ చేసేటప్పుడు రైతులు కాళ్లకు చెప్పులు, చేతికి రబ్బరు తొడుగు ధరించాలని, స్విచ్ బోర్డు పరిసర ప్రాంతాల్లో తేమ లేకుండా చూసుకోవాలన్నారు. స్టార్టర్లకు ఎర్తింగ్ చేయించుకోవడం వల్ల విద్యుత్ ప్రమాదాల బారి నుంచి తప్పించుకోవచ్చన్నారు. నీటిలో నిలుచొని విద్యుత్ మోటార్ల స్విచ్‌లను, విద్యుత్ పరికరాలను తాకరాదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో పంట పొలాలు జంతువుల బారిన పడకుండా కట్టెలపై విద్యుత్ కంచెను ఏర్పాటు చేయడం, ఫెన్సింగ్‌కు విద్యుత్ సరఫరా ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# గుప్త నిధుల కోసం తవ్వకాలు

- ఆరుగురి అరెస్ట్
- ఒక కారు, రెండు బైకులు స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్ఐ, పోలీసులు

**వేముల :** మండలంలోని మీదిపెంట్ల గ్రామ సమీపంలో గల గుట్టపైన శ్రీనరసింహస్వామి ఆలయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్న ఆరుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కారుతోపాటు రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రూరల్ సీఐ గోవిందురెడ్డి ఎస్ఐ ధనంజయుడుతో కలిసి శుక్రవారం వివరాలు వెల్లడించారు. మీదిపెంట్ల కోట సమీపంలోని నరసింహస్వామి ఆలయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నారన్న సమాచారం రావడంతో ఎస్ఐ ధనంజయుడు సిబ్బందితో కలిసి దాడులు చేశారు. పులివెందుల పట్టణానికి చెందిన జిలక వీరాంజనేయులు, మైదుకూరు పట్టణానికి చెందిన మాలేపాటి చంద్ర, బ్రహ్మంగారి మఠం మండలం రాజపేట గ్రామానికి చెందిన అంబవరం పీరుసాబ్, లింగాల మండలం కామసముద్రం గ్రామానికి చెందిన రొగ్గింజల మనోహర్, బద్వేలు మండలం కొత్తచెరువు గ్రామానికి చెందిన యాటగిరి రమణయ్య, యాటగిరి కవితను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి గునపాలు, గడ్డపారలు, బోలేలు, కారుతో పాటు రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## మైక్రోసాఫ్ట్ కంపెనీకి ఎంపిక



ఉద్యోగానికి ఎంపికైన విద్యార్థులు

**పులివెందుల రూరల్ :** సిలికాన్ వ్యాలీగా పిలవబడే బెంగళూరులోని ప్రపంచ సంస్థలలో ఒక్కటైన మైక్రోసాఫ్ట్ కంపెనీలో ఉద్యోగానికి పులివెందుల జేఎన్‌టీయూ విద్యార్థులు యామిని, రేవతి, సౌమ్యశ్రీ ఎంపికయ్యారు. బెంగుళూరులో శుక్రవారం జరిగిన ఈ సదస్సుకు మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదేళ్ల అధ్యక్షత వహించారు. దేశంలోని ప్రముఖ విద్యా సంస్థల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. అందులో సౌత్ ఇండియా నుంచి నలుగురు విద్యార్థులు కాగా.. అందులో ముగ్గురు విద్యార్థులు పులివెందుల జేఎన్‌టీయూ కళాశాలకు చెందిన వారే. కార్యక్రమంలో భవిష్యత్ ప్రణాళికలు, ఆలోచనలు, నైపుణ్యాల గురించి చర్చించారు. తర్వాత జరిగిన ఇంటర్వ్యూలో విద్యార్థులు యామిని, రేవతి, సౌమ్యశ్రీ ప్రతిభ కనబరిచి ఉద్యోగానికి ఎంపికయ్యారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**రాజంపేట :** మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం.రవి తెలిపారు. శుక్రవారం రాజంపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో ఏఐటీఎస్ పీజీ కాలేజీలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, అక్రమ రవాణా వ్యతిరేకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాల అనర్థాల గురించి తెలిపే సందేశాత్మక షార్ట్‌ఫిలిం పరివర్తనను ప్రదర్శించారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్ డా.డీజె సమతానాయుడు పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణం పూర్తి చేయండి



మాట్లాడుతున్న జేసీ సాయికాంత్‌వర్మ

**కడప సిటీ :** ప్రతి అధికారి అంకితభావంతో పని చేసి ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని జేసీ సాయికాంత్‌వర్మ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సభా భవనంలో జగనన్న హౌసింగ్ కాలనీలో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఆర్డీఓలు, నియోజకవర్గ, మండలస్థాయి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అన్ని రెవెన్యూ డివిజన్ల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**నాణ్యత పాటించాలి**

మనబడి నాడు – నేడు పనుల్లో నాణ్యత పాటించి, సకాలంలో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో మనబడి నాడు నేడు ఫేస్–2 పనుల పురోగతిపై విద్యాశాఖ, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఈఓ దేవరాజు, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి, ఆర్‌డబ్ల్యూస్ ఎస్ఈ వీరన్న, ఏపీ ఈడబ్ల్యూ ఐడీసీ ఈఈ కరణాకర్ రెడ్డి, సమగ్ర శిక్ష ఈఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి దారుణహత్య

– వివాహేతర సంబంధమే కారణం



హత్యకు గురైన సహదేవరెడ్డి

**తొండూరు :** మండలంలోని ఊడవగండ్ల గ్రామంలో శుక్రవారం ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. గ్రామానికి చెందిన రామిరెడ్డి సహదేవరెడ్డి(66)ని మచ్చుకొడవలితో అతి కిరాతకంగా నరికారు. రూరల్ సీఐ బాలమద్దిలేటి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తొండూరు మండలం ఊడవగండ్ల గ్రామానికి చెందిన రామిరెడ్డి సహదేవరెడ్డికి అదే గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి గంగిరెడ్డి భార్యతో వివాహేతర సంబంధం ఉన్నట్లు అనుమానం కలగడంతో.. మా ఇంటి వద్దకు ఎందుకు వచ్చావని గంగిరెడ్డి మందలించారు. దీంతో సహదేవరెడ్డికి, గంగిరెడ్డికి మాటకుమాట పెరిగి వాగ్వాదం జరుగుతుండగా.. గంగిరెడ్డి అన్న కుమారుడు ప్రహ్లాదారెడ్డి మచ్చుకొడవలితో సహదేవరెడ్డిపై దాడి చేశారు. గతంలో సహదేవరెడ్డి, గంగిరెడ్డి మధ్య పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. అయినప్పటికీ సహదేవరెడ్డి తీరు మారకపోవడంతో గంగిరెడ్డి ఇంటి సమీపంలో అరుగు మీద కూర్చొన్న సహదేవరెడ్డిని చూసి కోపోద్రిక్తులై సంఘటన జరిగినట్లు తెలిపారు. సహదేవరెడ్డి రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతుండగా.. కుటుంబ సభ్యులు 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ హనుమంతు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## యువకులపై కేసు నమోదు

**మదనపల్లె :** నడిరోడ్డులో విచక్షణ రహితంగా కొట్టుకున్న 8 మంది యువకులపై రెండు కేసులు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. ఈనెల 3న స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదురుగా కొందరు యువకులు క్రికెట్ బ్యాట్‌లతో ఒకరిపై ఒకరు దాడికి పాల్పడటం, సంఘటన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో విచారణ చేసి యువకులను గుర్తించినట్లు తెలిపారు. సంఘటనకు గల కారణాలను ఆయన వివరించారు. నిమ్మనపల్లె మండలం తవళం గ్రామానికి చెందిన విద్యార్థి సంతోష్ మదనపల్లెలోని ఓ డిగ్రీ కాలేజీలో చదువుతున్నాడు. ఇటీవల ఓ ఇంటర్ విద్యార్థినికి ప్రేమను వ్యక్తం చేసి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయం యువతి అన్న (పెద్దనాన్న కుమారుడు) మహమ్మద్‌అలీకి తెలియడంతో తన స్నేహితులు షాహిద్, పురుషోత్తం, సందీప్‌తో కలిసి.. సంతోష్, అతని స్నేహితులు వినోద్, మల్లికార్జున, ఓబులేసుపై దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో సంతోష్ వర్గంపై అమ్మాయిని వేధించినందుకు పోక్సో కేసు నమోదు చేయగా, మహమ్మద్‌అలీ వర్గంపై దాడి కేసు నమోదు చేశారు.